● సింగరేణి విద్యాసంస్థల 50 ఏళ్ల సందర్భం..

ఉచిత పాలిసెట్ కోచింగ్

● గ్రామీణ విద్యార్థులకు వరంలా శిక్షణ
● ర్యాంకుల సాధనే లక్ష్యం


సింగరేణి పాఠశాలలో కోచింగ్‌కు హాజరైన విద్యార్థులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి యాజమాన్యం చేపట్టిన పాలిసెట్ ఉచిత కోచింగ్ విద్యార్థుల పాలిట వరంగా మారింది. సింగరేణి వ్యాప్తంగా తొమ్మిది పాఠశాలల్లో సుమారు 1500 మంది విద్యార్థులకు యాజమాన్యమే కోచింగ్ ఇస్తోంది. విద్యార్థులు ర్యాంకులు సాధించాలనే లక్ష్యంతో యాజమాన్యం ఈ శిక్షణ తరగతులు ఏర్పాటు చేసింది.

సింగరేణి కార్మికుల పిల్లలు, ప్రభావిత పిల్లలకు మంచి విద్యనందించాలని తొలిసారిగా విద్యాసంస్థలు ఏర్పాటై సుమారు 50 ఏళ్లు అవుతున్న సందర్భంగా ఈ శిక్షణ తరగతులకు శ్రీకారం చుట్టింది. యాజమాన్యం సింగరేణి వ్యాప్తంగా ఉన్న తొమ్మిది పాఠశాలల్లో ఈ ఏడాది పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులందరికీ ఈ శిక్షణ ఏప్రిల్ 10వ తేదీ నుంచి మే 10 వరకు కొనసాగనుంది. ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. సొసైటీ నిర్వాహకులు, మండల ఎడ్యుకేషన్ ఆఫీసర్ సలహా మేరకు జిల్లా విద్యాశాఖ, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సింగరేణి సంస్థ ఈ బృహత్తర కార్యక్రమం చేపట్టింది.

కోచింగ్ బాగుంది...



సింగరేణి కోచింగ్ అంటే నామమాత్రంగా ఉంటుందనుకున్నాము. కానీ మంచి ఫ్యాకల్టీ వచ్చారు. ప్రతీ సబ్జెక్ట్‌లో పాఠాలు వివరంగా చెబుతున్నారు. ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. కోచింగ్ తరువాత రాయబోయే పాలిసెట్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధిస్తామనే నమ్మకం వచ్చింది. భవిష్యత్‌కు భరోసా కలిగింది. సింగరేణి తల్లికి రుణపడి ఉంటాము.

– కే.భువన్ తేజ్, విద్యార్థి

మంచి నిర్ణయం...



ఉద్యోగుల పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని సింగరేణి విద్యాసంస్థలు ఏర్పాటైన 50 ఏళ్ల సందర్భంగా కంపెనీ ఈ నిర్ణయం తీసుకోవటం శుభపరిణామం. వీలైతే నీట్, ఎంసెట్, ఈసెట్, వంటి పోటీ పరీక్షలకు కూడ ఉచితంగా కోచింగ్ ఇప్పిస్తే ఇంకా బాగుంటుంది. దీంతో సింగరేణి మహిళా కళాశాలలో సీట్లు త్వరితగతిన భర్తీ అవుతాయి. సింగరేణికి మరింత గుర్తింపు వస్తుంది.

– ఎం.నాగమణి, మ్యాథ్స్ టీచర్

విద్యార్థుల భవిష్యత్ కోసమే..



రూ.వేలు కట్టి కొంతమంది పిల్లలు పాలిటెక్నిక్ కోర్సు కోచింగ్ తీసుకుంటారు. కానీ నిరుపేదల విద్యార్థులకు కూడా ఉచితంగా కోచింగ్ ఇప్పించి పాలిసెట్‌లో మంచి ర్యాంకుతోపాటు, మంచి కోర్సులో ఉచితంగా సీటు పొందాలనే లక్ష్యంతో కంపెనీ ఈ నిర్ణయం తీసుకుంది. ఎడ్యుకేషన్ సొసైటీ వారి అభ్యర్థన మేరకు జిల్లా విద్యాశాఖ స్పందించి అవకాశం కల్పించటం హర్షణీయం.

– పూల్‌సింగ్, పాలిసెట్ కోచింగ్ ఇన్‌చార్జ్

‘బీఆర్‌ఎస్ పదేళ్ల పాలన.. స్వర్ణయుగం’


మాట్లాడుతున్న మాజీ మంత్రి వనమా

పాల్వంచ: ఈనెల 27న వరంగల్‌లో జరగనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు భారీగా తరలివెళ్లి విజయవంతం చేయాలని మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక పాత పాల్వంచలోని వనమా గృహంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వనమా మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ పదేళ్ల పాలన ఒక స్వర్ణయుగంగా సాగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మతిపోయేలా వరంగల్ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. 420 హామీలు, ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. కార్యక్రమంలో వనమా రాఘవేందర్‌రావు, కిలారు నాగేశ్వరరావు, కాంపెల్లి కనకేష్, మడివి సరస్వతి, దాసరి నాగేశ్వరరావు, పూసల విశ్వనాథం, మల్లెల శ్రీరామ్మూర్తి, కొత్వాల సత్యం, చందునాయక్, వీరు నాయక్, సురేష్, వీర్రాజు, చందు, అన్నం ప్రభాకర్ పాల్గొన్నారు.

హోర్డింగ్‌లు పెట్టొద్దు

కొత్తగూడెంటౌన్: పట్టణంలో ప్రజలకు ఇబ్బందులు కలిగించే హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయొద్దని, అందుకు అనుమతులు ఇవ్వొద్దని మున్సిపల్ అధికారులను కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ సూచించారు. బుధవారం కొత్తగూడెం డీఎస్పీ కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫుట్‌పాత్ ఆక్రమణలపై హెచ్చరికలు జారీ చేసి, ఆక్రమదారులు జరిమానా విధించాలన్నారు.

కొర్రమేను చేపల పెంపకం చేపట్టండి..


మాట్లాడుతున్న ఆక్వా అధికారి విద్య


ఇల్లెందురూరల్: కొర్రమేను చేపల పెంపకం లాభదాయకంగా ఉంటుందని డీపీఎం వెంకయ్య, ఏపీఎం దుర్గారావు సూచించారు. మండలంలోని సెర్ప్ కార్యాలయంలో కొర్రమేను చేపల పెంపకంపై బుధవారం పొదుపు సంఘాల సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ.. కొర్రమేను చేపలు అన్ని వాతావరణ పరిస్థితులకు తట్టుకునే గుణం కలిగి ఉండటంతో పెంపకందారులకు ప్రయోజనమన్నారు. మహిళా రైతులు తమ వ్యవసాయ క్షేత్రంలో నాలుగు కుంటల భూమి వైశాల్యంలో పావు కుంట పీవీసీ వాటర్ ట్యాంక్, మిగిలిన ముప్పావు కుంట స్ట్రక్చర్ నిర్మాణం, మూడు కుంటలు భూమిలో ఫారంపాండ్ నిర్మించాల్సి ఉంటుందన్నారు. చేపల దాణ, ఇతర ఖర్చులకు రూ.3.50 లక్షలు అవుతాయన్నారు. ఆయా పనులను పరిగణలోకి తీసుకొని చేపల పెంపకం యూనిట్ ఖర్చు రూ.4,41,795గా ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ఇందులో పీఎంజీఎస్‌వై పథకం ద్వారా రూ.1.40 లక్షలు సబ్సిడీ ఉంటుందని తెలిపారు.

ఇంతేకాకుండా ఉపాధి పథకం ద్వారా ఉచితంగా ఫారంపాండ్ నిర్మించుకోవచ్చన్నారు. అనంతరం చేపల పెంపకం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆక్వా అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు మేనేజర్ బాలకృష్ణ, టీజీబీ బ్యాంకు మేనేజర్ సత్యకీర్తి, కోటయ్య, ఫీల్డ్ ఆఫీసర్లు ఆనంద్, వీరన్న, సురేష్, శివ, రామకృష్ణ, ఉదయ్ ఆక్వా టెక్నికల్ మేనేజర్ విద్య తదితరులు పాల్గొన్నారు.

దళితుల చైతన్య యాత్ర

టేకులపల్లి: షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి జేఏసీ ఐక్య సంఘాల వేదిక ఆధ్వర్యంలో బేతంపూడి గ్రామంలో ఏజెన్సీ ప్రాంతంలో దగా పడ్డ దళితుల చైతన్య యాత్రను సింగరేణి రిటైర్డ్ జీఎం ఆనందరావు జెండా ఊపి ప్రారంభించారు. బొమ్మెర శ్రీనివాస్ మాట్లాడుతూ... ఏజెన్సీ ప్రాంతంలో తొలగించిన ఎస్సీ, బీసీ స్థానిక జెడ్పీటీసీ, ఎంపీటీసీ, రిజర్వేషన్లు స్థానిక ఉద్యోగ నియామకాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ పేరుతో షెడ్యూల్డ్ కులాలను హక్కులకు దూరం చేయొద్దన్నారు. అంకినీడు ప్రసాదు, కాకెల్లి సైమన్, మంద వెంకటేశ్వర్లు, ఎనగంటి కృపాకర్, మెంతిని ప్రభాకర్, మెంతిని కొండలరావు, నరాల రాజేష్, మీసాల రాములు, సరికొండ స్వామి, కత్తుల వెంకన్న, ఎనగంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకానికి మించిన నేస్తం లేదు..


టేకులపల్లి: బొమ్మనపల్లి పాఠశాలలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ

పాల్వంచ: పుస్తకానికి మించిన నేస్తం లేదని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొమ్ముగూడెం ప్రధానోపాధ్యాయులు ఎస్.మాధవరావు అన్నారు. బుధవారం ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు సేకరించిన పుస్తకాలతో స్టాల్ నిర్వహించారు. మాట్లాడుతూ... ప్రతీ విద్యార్థి చిన్నప్పటి నుంచి పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్, అరుణ, కామేశ్వరి, సత్య శ్రీదేవి, శారద, సుభద్ర, పద్మ, జరీనా భాను పాల్గొన్నారు.

టేకులపల్లి: ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా వేసవి సెలవుల్లో విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ఇంగ్లిష్, లెక్కలు సబ్జెక్టుల్లో ప్రాక్టీస్ చేసుకునే విధంగా ఇండియన్ స్కౌట్ అండ్ గైడ్ ఫెలోషిప్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు లోగాని శ్రీనివాస్ బుధవారం టేకులపల్లి మండలం బొమ్మనపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎం.జ్యోతిరాణి, జరపల పద్మ, నీరజ షారోన్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నేడు భూ భారతిపై అవగాహన సదస్సు

జూలూరుపాడు: జూలూరుపాడు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గురువారం భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ మేరకు బుధవారం కొత్తగూడెం ఆర్డీఓ డి.మధు ఏర్పాట్లను పరిశీలించారు. మాట్లాడుతూ.. ముఖ్యఅతిథులుగా వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, కలెక్టర్ పాటిల్ హాజరు కానున్నట్లు చెప్పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జగన్నాథపురంలో...

పాల్వంచరూరల్: జగన్నాథపురంలోని రైతువేదికలో ఈనెల 27వ తేదీ ఉదయం 11 గంటలకు ఆర్‌ఓఆర్ 2025 చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వివేక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

27న చలో వరంగల్

టేకులపల్లి: ఈనెల 27న వరంగల్‌లో జరగనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు భారీగా తెలంగాణ వాదులు, బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు తరలిరావాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం టేకులపల్లిలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బొమ్మెర వరప్రసాద్ గౌడ్, బోడ బాలు, భూక్యా లాలు, రవి, నాగేంద్ర, సురేష్, బానోత్ రామానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంఘాలతో సమావేశం

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా కార్మిక సంఘాల నెలవారీ సమావేశం బుధవారం జీఎం చాంబర్‌లో జీఎం వీసం కృష్ణయ్య అధ్యక్షతన జరిగింది. ఐఎన్‌టీయూసీ సంఘం నేత జే.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఏరియాలో పని చేసే కార్మికులు వారి పని స్థలాలలో ఎదుర్కొనే పలు సమస్యలను జీఎం దృష్టికి తీసుకొచ్చారు.

వేతనాలు చెల్లించండి..

ఇల్లెందురూరల్: బొజ్జాయిగూడెం పంచాయతీ వర్కర్లకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ ఐఎఫ్‌టీయూ అనుబంధ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ ధన్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. సారంగపాణి మాట్లాడుతూ.. ఇప్పటికే పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. మోహన్‌రావు, కార్మికులు పాల్గొన్నారు.

వాగు దాటి వ్యవసాయం

హైలెవెల్ బ్రిడ్జి నిర్మించరూ..!
● దశాబ్దాలుగా కిష్టారం రైతుల ఎదురు చూపులు
● ముర్రేడు వాగు దాటి వ్యవసాయ పనులకు వెళ్లలేక అవస్థలు

టేకులపల్లి: వారంతా రెక్కలు ముక్కలు చేసుకుని స్వేదం చిందించి దేశానికి ఆహార పంటలు అందించే రైతులు. అలాంటి రైతులు అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. వ్యవసాయ పనులకు వచ్చిపోయేటప్పుడు వాగు దాటడం ఇబ్బందిగా ఉంది. 40 సంవత్సరాలుగా అధికారులకు, పాలకులకు అనేక పర్యాయాలు సమస్యను వివరించినా పరిష్కారానికి నోచుకోవడం లేదు. టేకులపల్లి మండలం కిష్టారం గ్రామానికి చెందిన రైతుల సాగు భూములు సుమారు రెండు వేల ఎకరాలు ముర్రేడు వాగుకి అవతల ఉన్నాయి. వ్యవసాయ పనులకు వాగు దాటి వెళ్లాల్సి ఉంటుంది. దశాబ్దాలుగా అనేక ఇబ్బందులు పడుతూనే వాగు దాటి వెళ్లి వ్యవసాయ పనులు చేస్తున్నారు. ఏడాదికేడాది సమస్య తీవ్రత పెరుగుతోంది. వ్యవసాయ సామగ్రి తీసుకెళ్లేందుకు, పంటలను తీకొచ్చేందుకు వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితి.

ఈ ఏడాది వచ్చిన వరదలకు వాగులో రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. బండరాళ్లు కొట్టుకొచ్చాయి. ఈ నేపథ్యంలో ఈనెల 18న రైతులు చందాలు వేసుకుని జేసీబీ సహాయంతో వాగులో అడ్డుగా ఉన్న రాళ్లను తొలగించి దారిని తాత్కాలికంగా బాగు చేసుకున్నారు. ఇక్కడ హైలెవెల్ బ్రిడ్జి నిర్మించాలన్నది రైతుల డిమాండ్. ఈ బ్రిడ్జి నిర్మాణం జరిగితే వానాకాలంలో వరద ఉధృతంగా ప్రవహిస్తున్నప్పటికీ పంట పొలాలకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి హైలెవెల్ బ్రిడ్జి నిర్మించాలని రైతులు కోరుతున్నారు.


కిష్టారం ముర్రేడు వాగుపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మించాల్సిన ప్రదేశం

వంతెన నిర్మించాలి..



కిష్టారం గ్రామానికి చెందిన రైతులకు సంబంధించిన సుమారు రెండు వేల ఎకరాల సాగు భూములు ముర్రేడు వాగు అవతల ఉన్నాయి. వ్యవసాయ పనులకు వచ్చిపోయేటప్పుడు వాగు దాటడం ఇబ్బందిగా ఉంది. వర్షాకాలం వాగు దాటడం కుదరదు. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రత్యేక చొరవ తీసుకుని హైలెవెల్ బ్రిడ్జి మంజూరు చేయించి సత్వరమే నిర్మించాలి.

– చింత సంపత్, కిష్టారం

ప్రకృతిని రక్షిస్తేనే మానవ మనుగడ


మాట్లాడుతున్న జయరాజు పక్కన ఎమ్మెల్యే కనకయ్య, డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందు: మానవాళి మనుగడకు ప్రకృతి ఎంతో అవసరం అని ప్రకృతి ప్రేమికుడు, కవి, గేయ రచయిత, వాగ్గేయకారుడు జి.జయరాజు అన్నారు. బుధవారం ఇల్లెందులోని ఐతా ఫంక్షన్ హాల్‌లో సిద్ధార్థ ఆరోగ్య ఆశ్రమం ఆధ్వర్యంలో ప్రకృతి ఆరోగ్య మహాసభలు నిర్వహించారు. జయరాజు మాట్లాడుతూ.. మానవాళిని పంచభూతాలు శాసిస్తున్నాయని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి మీద ఉందన్నారు. పంటలపై క్రిమిసంహారక మందుల వాడకం పెరిగిపోయిందన్నారు. విషాహారం భుజిస్తున్నామని తెలిపారు. శుభకార్యాలకు ఒకనాడు ఇస్తరాకులు, స్టీల్ గ్లాసులు వాడేవారు.. ప్లాస్టిక్ ప్లేట్లు వాడుతున్నామని పేర్కొన్నారు. వేడివేడి ఆహారం ఆ ప్లేట్ తింటే పైపూతగా ఉన్న ప్లాస్టిక్ కాగితం కడుపులోకి వెళ్లి క్యాన్సర్‌కు కారణమవుతుందని తెలిపారు. ఇక బావులు, బోర్ల లోని నీటిని తాగితే ఆరోగ్యం అన్నారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ.. ఒకనాడు ఇంటి పెరటిలో అనేక రకాలైన మొక్కలు ఉండేవని, వాటిని మందులుగా కూడా వాడేవారని తెలిపారు. ఇప్పుడవి మాయం అయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో రావూస్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి డాక్టర్ రవికుమార్, ప్రభుత్వ వైద్యులు, మున్సిపల్ మాజీ చైర్మన్ డీవీ, డీఎస్పీ చంద్రభాను పాల్గొన్నారు.

అత్యుత్తమ ఫలితాలు సాధించిన ‘సింగరేణి’

సింగరేణి(కొత్తగూడెం): ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో కొత్తగూడెంలోని సింగరేణి మహిళా కళాశాల విద్యార్థినులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో రాష్ట్ర ఉత్తీర్ణత శాతం 71.37 కాగా, సింగరేణి కళాశాల 81శాతం సాధించింది. ప్రథమ సంవత్సరంలో రాష్ట్ర ఉత్తీర్ణత శాతం 66.89 కాగా, ఈ కళాశాల 73.07 శాతం సాధించింది. సీనియర్ ఇంటర్ విద్యార్థిని హాసిని 992 మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంకర్‌గా నిలిచింది. సింగరేణి మహిళా జూనియర్ కళాశాల రాష్ట్ర స్థాయి సగటు ఉత్తీర్ణత కన్నా ఎక్కువ ఉత్తీర్ణత సాధించడమే కాక పలువురు విద్యార్థినులు అత్యుత్తమ మార్కులు సాధించడంపై సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ హర్షం వ్యక్తం చేశారు.

ఆరు గ్యారంటీల అమలేది ?

ఇల్లెందురూరల్: నెల రోజులుగా సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఇంటింటి సర్వే ఆధారంగా గుర్తించిన సమస్యల పరిష్కారం కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ ధన్‌సింగ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, ఏజే రమేష్ మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలుపై ప్రభుత్వం చిత్తశుద్ధి చూపడం లేదని ఆరోపించారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, రేషన్ కార్డులు మంజూరు చేయడం లేదన్నారు. సీఎస్పీ బస్తీ గుడిసెవాసులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. జేకే ఓసీ విస్తరణ పేరుతో 21పిట్ ఏరియాలో నివాస గృహాలకు చిన్నచిన్న మరమ్మత్తులకు కూడా అవకాశం ఇవ్వకుండా సింగరేణి అధికారులు ఇబ్బంది పెట్టడం సరైంది కాదన్నారు. నిర్వాసితులకు మెరుగైన పునరావాస ప్యాకేజీని మంజూరు చేయాలని కోరారు. అబ్దుల్ నబీ, ఆలేటి కిరణ్, తాళ్లూరి కృష్ణ, మన్యం మోహన్‌రావు, సుల్తానా, సంధ్య, వెంకటేశ్వర్లు, బోస్, మరియ పాల్గొన్నారు.

పట్టణంలో సమస్యలు పరిష్కరించండి..



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు

ఇల్లెందు: పట్టణంలోని పలు వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం డిమాండ్ చేసింది. బుధవారం ఇల్లెందు మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి మున్సిపల్ మేనేజర్ అంకుషావలీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పట్టణంలో పలు వార్డుల్లో సమస్యలు పేరుకుపోయాయని తెలిపారు. రెండేళ్లుగా పలు అభివృద్ధి పనులకు రూ.లక్షలు ఖర్చు చేశారని, అసంపూర్తిగా ఉన్నాయని తక్షణం వాటిని పూర్తి చేసి ఉపయోగంలోకి తీసుకరావాలని కోరారు. ఏజే రమేష్, ఆలేటి కిరణ్, నబీ, కృష్ణ, మోహన్‌రావు పాల్గొన్నారు. అంతకు ముందు పట్టణంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు.

‘ఉపాధి’ వద్ద వసతులు కల్పించండి..

పాల్వంచరూరల్: ఉపాధి హామీ పథకం పనుల వద్ద కూలీలకు నీడ, తాగునీటి వసతిని కల్పించాలని జిల్లా పంచాయతీ అధికారి వి.చంద్రమౌళి అధికారులను ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశంలో బుధవారం గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామి సిబ్బందితో జరిగిన సమీక్ష సమావేశంలో డీపీఓ పనులపై సమీక్షించారు. ఉపాధి పనుల్లో ఫారంపాండ్లు, కచ్చా రోడ్డు నిర్మాణ పనులకు ప్రాధాన్యం కల్పించాలని సూచించారు. గ్రామపంచాయతీల ద్వారా నాటిన మొక్కలను వేసవిలో చనిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుధాలక్ష్మి, ఎంపీఓ బి.నారాయణ, ఏపీఓ పోరండ్ల రంగా, ఇరిగేషన్ ఏఈ దేవదాస్‌రాథోడ్ పాల్గొన్నారు.

ఉగ్రదాడిని ఖండిస్తూ నిరసన


పాల్వంచరూరల్: పాకిస్తాన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

కొత్తగూడెంటౌన్: జమ్మూ కశ్మీర్‌లో టూరిస్టులపై ఉగ్రవాదుల దాడులు హేయమైన చర్యలను ఖండిస్తూ కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. జిల్లా కోర్టులోని లైబ్రరీ హాల్‌లో సభ్యులు ఉగ్రవాదుల దాడిలో మరణించిన పర్యాటకుల ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు. బార్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, బాగం మాధవరావు, ఉప్పు అరుణ్, అడపాల పార్వతి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి(కొత్తగూడెం): ఉగ్రవాద దాడిని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్ లెనినిస్ట్) మాస్‌లైన్ కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి జాటోత్ కృష్ణ, టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి పెద్దబోయిన సతీష్ బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు.

పాల్వంచరూరల్: జమ్మూ కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడికి నిరసనగా బుధవారం రాత్రి బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక పట్టణంలో జాతీయ జెండాతో నిరసన ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ సెంటర్‌లో పాకిస్తాన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. పానిశెట్టి వెంకటేశ్వర్లు, నరేష్, మాదారపు లక్ష్మణ్, శాంపూరి పద్మ, నీల, మల్లికా పాల్గొన్నారు.

జూలూరుపాడు: కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రదాడిని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీ మండల కార్యదర్శి బానోత్ ధర్మా తీవ్రంగా ఖండించారు. బుధవారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ.. ఉగ్రవాదులు కాల్పులు జరపడం హేయమైన చర్య అన్నారు.

క్లుప్తంగా

పాఠశాలకు సామగ్రి వితరణ

ఇల్లెందురూరల్: ముత్తారపుకట్ట ప్రాథమిక పాఠశాలకు పలువురు దాతలు బుధవారం బీరువా, ర్యాక్‌లను వితరణగా అందజేశారు. పాఠశాలలో ఏర్పాటైన తల్లిదండ్రుల సమావేశంలో ఎస్ఎంసీ చైర్మన్ కుంజ కృష్ణవేణి, రాంబాబు, పొడుదు ప్రియాంక, పాష, పొడుగు రాంబాబు తదితరులు సామగ్రిని ప్రధానోపాధ్యాయుడు కబ్బాకుల రవికి అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఘనంగా సన్మానించారు. మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కిన్నెర నర్సయ్య, మాజీ సర్పంచ్ మంకిడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీలో పతకాలు

చుంచుపల్లి: హైదరాబాద్ రామాంతపూర్‌లో ఈ నెల 18, 19 తేదీల్లో జరిగిన తెలంగాణ రాష్ట్ర క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో డీఆర్‌డీఏలో డీపీఎంగా పనిచేస్తున్న ఎం.రంగారావు 105 కేజీల మాస్టర్ విభాగంలో బంగారు పతకం సాధించారు. ఈ మేరకు రంగారావును బుధవారం డీఆర్‌డీఓ ఎం.విద్యాచందన ఆధ్వర్యంలో ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

పాల్వంచ: హైదరాబాద్‌లో జరిగిన క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మాస్టర్ 2 విభాగంలో 93 కేజీల విభాగంలో పాల్వంచకు చెందిన కిలారి భవానీ శంకర్ రజత పతకం సాధించారు. ఈ సందర్భంగా బుధవారం పాత పాల్వంచలోని కొత్వాల స్వగృహంలో భవానీ శంకర్‌ను కొత్వాల శ్రీనివాసరావు సత్కరించారు. బరపటి వాసుదేవరావు, వెంకటేశ్వరరావు, కిలారి సుజాత పాల్గొన్నారు.

రేపు జిల్లా సదస్సు

జూలూరుపాడు: ఈనెల 25న కొత్తగూడెంలో సీపీఎం ఆధ్వర్యంలో సీతారామ ప్రాజెక్టు నీళ్ల వినియోగంపై జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు కొండపల్లి శ్రీధర్ తెలిపారు. బుధవారం రామచంద్రాపురం గ్రామంలో జరిగిన పార్టీ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీతారామ నీళ్లను జిల్లాకు వినియోగించాలన్నారు. అశ్వాపురం మండలంలో ప్రారంభమై రోళ్లపాడు రిజర్వాయర్‌కు తరలించి జిల్లాను సస్యశ్యామలం చేయాలని కోరారు. నాగార్జున సాగర్ ఆయకట్టు స్థిరీకరణ పేరుతో జిల్లా నుంచి ఇతర జిల్లాలకు తరలించడం సరైంది కాదన్నారు. జిల్లాకు అన్యాయం చేస్తే రైతాంగం ఊరుకోదన్నారు. జిల్లా సదస్సును విజయవంతం చేసేందుకు రైతులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. యాసా నరేష్, పద్దం సుగుణ, నరసింహారావు, ఇందిరా, సరిత పాల్గొన్నారు.

దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి..

పాల్వంచ: కార్మికవర్గ రక్షణ కోసం జరుగుతున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మచారి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బ్రహ్మచారి మాట్లాడుతూ.. దేశంలోని కార్మిక వర్గ రక్షణ, హక్కులు, ఉద్యోగ భద్రత, జీతాల పెంపు, కనీస వేతనాల అమలు, పెరిగిన ధరలు తగ్గించడం, నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోసం జరుగుతున్న దేశ వ్యాప్త కార్మికవర్గ సమ్మెకు సిద్ధం కావాలన్నారు. నేటి నుంచి పనిప్రాంతాల్లో సమ్మె జయప్రదం కోసం ప్రచారం చేయాలన్నారు. దొడ్డ రవికుమార్, కె.సత్య, మొగిలి, ముంతాజ్ పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి..

ఇల్లెందు: సింగరేణి సంస్థ ఇల్లెందు ఏరియాలో పని చేస్తున్న అధికారులు, ఉద్యోగుల సంక్షేమంలో భాగంగా 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఉద్యోగుల పిల్లలు నీట్, ఎంసెట్, ఏఐఐఎం, బిట్స్ ప్రవేశ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించి సంబంధిత విద్యా సంస్థల్లో ప్రవేశం పొందినవారికి సింగరేణి సంస్థచే మెరిట్ స్కాలర్ షిప్ పొందుటకు దరఖాస్తు చేసుకోవాలని జీఎం బుధవారం ఒక ప్రకటనలో కోరారు. 2000 వేల నుంచి 8000 వేల ర్యాంక్ పొందిన వారు అర్హులని తెలిపారు.

విచారణ జరిపించండి..

కొత్తగూడెంటౌన్: బస్టాండ్ సెంటర్‌లో బుధవారం సేవాలాల్ బంజార సంఘం ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లావుడ్యా ప్రసాద్ నాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో నోటిఫికేషన్ ద్వారా జరిగిన ఔట్ సోర్సింగ్ నియామకాల్లో అవకతవకలు జరిగాయని, విచారణ జరపాలని కోరారు. బానోతు శ్రీనివాస్, బోడ శ్రీను, నాగరాజు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడు మృతి

పాల్వంచ: సీపీఐ సీనియర్ నాయకులు, ఉమ్మడి ఖమ్మం జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యులు, ఖమ్మంకు చెందిన వెంపటి సూర్యనారాయణ(85) అనారోగ్యంతో బుధవారం పాల్వంచలోని ఆయన కూతురు నివాసంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న నాయకులు బాగం హేమంతరావు, ఎస్‌కే సాబీర్ పాషా, దండి సురేష్, ముత్యాల విశ్వనాథం, అడుసుమల్లి సాయిబాబా, ఉప్పుశెట్టి రాహుల్, సింగు నరసింహారావు, యర్రా బాబు, తాటి వెంకటేశ్వర్లు తదితరులు వచ్చి సూర్యనారాయణకు నివాళులర్పించారు.